ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 25 మార్చి 2024

రంజాన్ వేళలు | సోమవారం(ఇఫ్తార్-6:36) | మంగళవారం (సహార్-4:56)



వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఎర్రవల్లి, మార్చి 24 : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీ చిన్నకృష్ణ (55) ఆదివారం వడదెబ్బతో మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నకృష్ణ ఉపాధి పనులకు వెళ్తున్నాడు. శనివారం పనికి వెళ్లిన ఆయన వడదెబ్బకు గురై అక్కడే కుప్ప కూలిపోయాడు. తోటి కూలీలు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయడంతో కోలుకున్నాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన ఆయన అదే రోజు అర్ధరాత్రి తర్వాత పరిస్థితి విషమించి చనిపోయినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను తెలిపారు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై..

వర్ష ప్రభావం

- ఈ ఏడాది వానలు లేక తగ్గిన సాగు
- లక్ష్యం 26,900 ఎకరాలు.. సాగు చేసింది 10,162 ఎకరాలు



హన్వాడ మండలం టంకరలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోట

పాలమూరు, మార్చి 24: వర్షాభావం వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు తగ్గింది. లక్ష్యంలో ఈ ఏడాది 45 శాతమే సాగయ్యింది. రైతులకు ఆదాయం పెంచాలని తెలంగాణ ప్రభుత్వం వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును 2019లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది. అప్పట్లో 232 ఎకరాల్లో రైతులు ఈ తోటలను సాగు చేశారు. ఈ తోటలను ఒక్కసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. దిగుబడి వచ్చే వరకు అంతర పంటలు వేసుకుంటే నాలుగేళ్ల వరకు ఆర్థిక సాయం అందిస్తుంది. అయితే ఈ ఏడాది(2023-24) ఉమ్మడి జిల్లాలో 26,900 ఎకరాల్లో తోటలు సాగు చేయాలని లక్ష్యం ఉండగా.. వర్షాభావంతో 10,162 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మొక్కలు కావాలని వానాకాలంలో దరఖాస్తు చేసుకున్న రైతులు వర్షాభావ పరిస్థితులతో వెనుకడుగు వేశారు. దాంతో ఇంకా 16,738 ఎకరాల లక్ష్యాన్ని మార్చి చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

జిల్లాల వారీగా ఈ ఏడాది లక్ష్యం.. సాగు వివరాలు

జిల్లా	సాగు లక్ష్యం	చేపట్టింది
మహబూబ్‌నగర్	3,500	1,419
నారాయణపేట	6,200	2,430
నాగర్‌కర్నూల్	5,800	3,100
వనపర్తి	5,800	1,698
జోగుళాంబ గద్వాల	5,600	1,515

భారీ సబ్సిడీ

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తోంది. ఒక మొక్క విలువ రూ.193 ఉండగా.. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.173 చెల్లిస్తోంది. రైతు కేవలం రూ.20 మాత్రమే చెల్లించాలి. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ(జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది)లకు వంద శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీతో ఇస్తోంది. పంట చేతికొచ్చే నాలుగో ఏడాది వరకు అంతర పంటల సాగు కోసం ఎకరాకు ఏటా రూ.2,100, తోటల సాగు కోసం రూ.2,100 ప్రోత్సాహకం అందిస్తారు. అంటే ఎకరాకు ఏటా రూ.4,200 ఇస్తారు. రైతులు మొక్కలు నాటేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గుంతలు తీయిస్తారు. పెట్టుబడి అంతా ప్రభుత్వం ఇస్తుండటం, మొక్కలు ఇచ్చిన కంపెనీయే దిగుబడిని కొననుండటంతో ఈ తోటల సాగుపై చిన్న, సన్నకారు రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. మూడేళ్లపాటు అంతర పంటలు సాగు చేశాక, నాలుగో ఏడాది నుంచి ఎకరానికి కనీసం 12 టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎకరాకు కనీసం రూ.లక్ష విలువచేసే దిగుబడి వస్తుందని అంటున్నారు. 50 ఏళ్ల వరకు దిగుబడులు రానున్నాయి. వీటిలో పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు.



బాలానగర్ మండలం గుండేడు గ్రామంలో రైతు నరసింహారెడ్డి ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ..



ఆయిల్ పామ్ సాగుతో రైతులు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో అధిక రాబడి పొందొచ్చు. జిల్లాలో గతంలో నిర్ణయించుకున్న దానికంటే ఎక్కువ మంది రైతులు సాగుకు ముందుకు వస్తుండటంతో విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. ఈ ఏడాది వర్షాభావంతో సాగు కొంత తగ్గింది. మూడేళ్ల కిందట నాటిన మొక్కలు ఎకరాకు నాలుగు టన్నులు దిగుబడి రావటం సంతోషం. దిగుబడి ఆశాజనకంగా ఉంది.

- కె.వేణుగోపాల్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి

అధికారులు సూచనలు ఇస్తున్నారు



నేను 2022-23లో ఐదెకరాల్లో 285 ఆయిల్ పామ్ మొక్కలు నాటిన. ఏటా అంతర పంటల సాగుకు ప్రభుత్వం నుంచి సహకారం ఉంది. ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారులు, ప్రీయూనిక్ కంపెనీ సిబ్బంది తోటల సాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రెండేళ్ల తరువాత దిగుబడి వస్తుంది.

- నరసింహారెడ్డి, ఆయిల్‌పామ్ రైతు, గుండేడు గ్రామం, బాలానగర్

గద్వాల-మాచర్లకు..

మోక్షం కలిగేనా?

- ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదనలకే పరిమితమైన రైలు మార్గం
- మూడు దశాబ్దాలుగా ఎదురుచూపులు
- ఎంపీ వ్యాఖ్యలతో ఆశలు



గద్వాల జంక్షన్

గద్వాల అర్బన్, మార్చి 24: గద్వాల-మాచర్ల కొత్త రైలు మార్గం ఏర్పాటు మూడు దశాబ్దాలుగా కలగానే మిగిలింది. ఇటీవల అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపడుతున్న నేపథ్యంలో ఈ కొత్త రైలు మార్గంపై ప్రజల్లో మరోసారి చర్చ మొదలైంది. రూ.9.5 కోట్లతో గద్వాల రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరిచేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల వర్చువల్‌గా పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు పోతుగంటి రాములు మాట్లాడుతూ గద్వాల-మాచర్ల రైలు మార్గం నిర్మాణానికి రైల్వే శాఖ, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందంటూ చేసిన ప్రకటనతో ప్రయాణికుల్లో మరోసారి ఆశలు చిగురించాయి.

కొత్త మార్గం నేపథ్యం



సంస్థానాల పాలన రద్దయ్యి నడిగడ్డ యూనియన్ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిన తర్వాత గద్వాలను రైల్వే జంక్షన్‌గా అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సంస్థానాధీశులు దాదాపు 200 ఎకరాల భూమిని దానంగా ఇవ్వడంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో గద్వాల తొలి ఎమ్మెల్యే పాగ పుల్లారెడ్డి రాయచూర్-గద్వాల మధ్య కొత్త రైలు మార్గం చేపట్టాలని, అదే మార్గాన్ని గద్వాల నుంచి గుంటూరు జిల్లా మాచర్ల వరకు పొడగించాలని అప్పటి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు.

దేశ వాణిజ్య, ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబాయి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఉన్న విజయవాడను లింక్ చేయడమే రాయచూరు-మాచర్ల కొత్త రైలు మార్గం ప్రధాన ఉద్దేశంగా అప్పటి పాలకులు తెలిపారు. ఆ క్రమంలో 1980లో తొలి దశలో రాయచూర్ నుంచి గద్వాలకు, అనంతరం గద్వాల నుంచి వనపర్తి, నాగర్‌కర్నూల్, దేవరకొండ మీదుగా మాచర్లకు కొత్త మార్గం నిర్మించాలని పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాయచూరు-గద్వాల మధ్య నిర్మాణ పనులను చేపట్టి.. 2013లో ఈ మార్గంలో డెమో రైలు ప్రారంభించారు. కానీ గద్వాల-మాచర్ల మార్గంపై ఇప్పటికీ స్పష్టత కరువైంది. ఇటీవల ఎంపీ రాములు చేసిన వ్యాఖ్యలతో మరోసారి కొత్త మార్గం ఏర్పాటుపై ఆశలు చిగురించాయి.

అమృత్ భారత్ లో అవకాశం కల్పించాలి



అమృత్ రైల్వే పేరుతో కేంద్ర ప్రభుత్వం రైల్వేల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న గద్వాల-మాచర్ల రైల్వే మార్గానికి అవకాశం కల్పించాలి. ఈ మార్గం ఏర్పాటు ద్వారా ప్రయాణ సౌకర్యాలతో పాటు వ్యాపార పరంగా అన్ని ప్రాంత్రాలు మరింత అభివృద్ధి చెందే అకాశం ఉంటుంది.

- పి. కృష్ణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగి, గద్వాల

ప్రజాప్రతినిధులు పట్టుదలతో సాధించాలి



ఏళ్ల తరబడి ప్రతిపాదనలు, కాగితాలకే పరిమతమవుతున్న గద్వాల-మాచర్ల రైల్వే మార్గం ఏర్పాటు కోసం ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు మరింత పట్టుదలతో కృషి చేయాలి. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు బృందంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి.

- ఎస్. వెంకటరమణ, ఉపాధ్యాయుడు

ఆంక్షలు తొలగేనా?

- ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా తీసుకెళ్లొచ్చంటున్న ప్రభుత్వం
- అమలైతే తీరనున్న ఇబ్బందులు
- క్షేత్రస్థాయిలో ఎన్నో అవస్థలు
- డబ్బులు పెట్టినా దొరకని పరిస్థితి



ఇసుక కొరతతో ఓ ఇంటి నిర్మాణానికి వాడుతున్న డస్ట్

మహబూబ్‌నగర్, మార్చి 24: ఇసుక కొరతతో నిర్మాణాలు సాగక ఆటు బాధితులు, పనులు లేక ఇటు భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తమౌతోంది. ప్రభుత్వం అధికారులతో సమావేశం నిర్వహించి.. ఇసుక లేక జనం ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నందున సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణాలు చేసుకునేవాళ్లు ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని, అందుకు అధికారులు అడ్డు పడొద్దని చెప్పడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ పథకాలకు ఇసుక ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దాంతో ఇసుక కొరత రాకుండా చూడాలని, లేదంటే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించడంతో ఇకనైనా ఆంక్షలు తొలగిస్తారో లేదో చూడాలి. 1, 2, 3 కేటగిరీల రీచ్‌ల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం చెప్పింది. జిల్లాలోని కోయిలకొండ, జాతీయ రహదారిపై ఉన్న పెద్దమ్మ వాగు, మిడ్జిల్ మండలం దుందుభీ వాగు ఈ 1, 2, 3 కేటగిరీల కిందకే వస్తాయి.

అందరి కళ్లు వాటిపైనే

గ్రామాల్లో ఉన్న వాగులు, వంకల్లోంచి ఆయా గ్రామాల ప్రజలు ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక తీసుకెళ్లాలన్నా పోలీసులు, తహసీల్దార్, గ్రామ సర్పంచ్ నుంచి అనుమతులు కావాలి. ఇసుక వాహనం రోడ్డెక్కితే అందరి కళ్ల వాటిపైనే ఉంటాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు నెలలుగా ఇసుక రవాణా బంద్ కావడంతో చాలాచోట్ల భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. డబ్బులు ఇచ్చినా ఇసుక లభించని పరిస్థితి నెలకొంది. దళారులు, అక్రమార్కులు.. పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, ఇసుక ధరను డబుల్ చేసి అర్ధరాత్రి వేళ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ సౌకర్యం కూడా ప్రజలు అందుబాటులో లేకుండా పోయింది. అధికారులు వారికి కావలసిన వ్యక్తులకు ఇసుక అవసరం ఉంటే సదరు వ్యక్తులకు సమాచారం ఇచ్చి, అరగంటపాటు ఆన్‌లైన్ స్లాట్ ఓపెన్ చేసి, ఆ వెంటనే క్లోజ్ చేస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌లకు ప్రస్తుతం మూసాపేట మండలం పోల్కంపల్లి వాగు నుంచి ఇసుక సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని చెబుతుండగా క్షేత్రస్థాయిలో మాత్రం డబ్బులు ఇస్తామన్నా దొరకని పరిస్థితి నెలకొంది. ఆంక్షలు సడలించి, నెల రోజులు సరఫరా చేస్తే తప్ప భవన నిర్మాణ రంగానికి ఇసుక కొరత తీరేలా లేదు. ప్రభుత్వ ఆదేశాలను అధికారులు క్షేత్ర స్థాయిలో ఏ మేరకు అమలు చేస్తారో చూడాలి.



ఇసుక కొరతతో నిలిచిన ఇంటి నిర్మాణం(ఫైల్)

నేడు రంగోళి

- హోలీ వేడుకలకు ఊరూవాడా రెడీ



నారాయణపేటలో విక్రయిస్తున్న రంగులు, కలర్ గన్స్

మహబూబ్‌నగర్, మార్చి 24: రంగుల పండుగ హోలీని సోమవారం జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు రెడీ అయ్యారు. ఈ పండగ అనగానే అందరిలో జోష్ నెలకొంటుంది. చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అందరూ సంబురాల్లో మునిగితేలుతారు. ఇప్పటికే ఆయా పట్టణాల్లో రంగులను విక్రయిస్తున్నారు. చిన్న పిల్లల కోసం కలర్ గన్స్ అమ్ముతున్నారు. గతంలో హోలీ అనగానే ఈ సమయంలో విరబూసే మోదుగపూలను దంచి, నీటిలో కలిపి చల్లుకునేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే రసాయన రంగులు, సునేర్, గులాల్‌లనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. పాలమూరు జిల్లా కేంద్రంతోపాటు జడ్చర్ల, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మక్తల్ పట్టణ కేంద్రాల్లో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. పాలమూరులోని పాన్ చౌరస్తాలో మార్వాడీలు వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. బాజాభజంత్రీలతో వీధుల్లో ర్యాలీలు నిర్వహిస్తారు. పలు వీధుల్లో డెక్కులను ఏర్పాటు చేసి నృత్యాలు చేస్తారు. హోలీ సందర్భంగా హైదరాబాద్ పరిధిలో మద్యం దుకాణాలను ఒకరోజు మూసి వేస్తుండగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో తెరిచే ఉంచనున్నారు. వేడుకలు శ్రుతిమించి గొడవలకు దారి తీసే అవకాశం ఉండటంతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. అసలే ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుశాఖ పెట్రోలింగ్‌ను పెంచాలని నిర్ణయించింది.



హన్వాడలో విరగబూసిన మోదుగ పూలు

నెల పూజతో ముగిసిన

గంగ మంత్రాలమ్మ జాతర



గంగమంత్రాలమ్మకు బోనాలు తీసుకొస్తున్న భక్తులు

కోడేరు, మార్చి 24 : నెల పూజతో గంగమంత్రాలమ్మ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సిడెతో మొదలైన వారోత్సవాలు పది రోజులు కొనసాగాయి. భక్తులు గంగ మంత్రాలమ్మకు వడి బియ్యం, ముక్కు పుల్లలు, గాజులు తదితర వస్తువులు వితరణ చేశారు. నెలపూజ రోజు భక్తులు పెద్ద ఎత్తున బోనాలు, కొబ్బరికాయలు, కోళ్లు, యాటలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ తమ కోరికలను కోరుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా గంగ మంత్రాలమ్మ దేవతకు పేరు ఉందని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రాలమ్మ వారోత్సవాలకు ప్రజాప్రతినిధులు సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

భారీ అగ్ని ప్రమాదాలు

- నారాయణపేట జిల్లాలో కాటన్ మిల్లులో..
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయిల్ ఫ్యాక్టరీలో..



నారాయణపేట జిల్లా బసవేశ్వర జిన్నింగ్, కాటన్ మిల్లులో జరిగిన ప్రమాదంలో కాలిబూడిదైన పత్తి

మహబూబ్‌నగర్/మాగనూరు, మార్చి 24: నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాటు శివారులోని బసవేశ్వర జిన్నింగ్, కాటన్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదం జరుగగా.. మహబూబ్‌నగర్ సమీపంలోని కోడూరు శివారులో గల చెరుకుపల్లి ఆగ్రోప్రొడక్ట్స్ ఆయిల్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి ప్రమాదం సంభవించింది. రెండు చోట్లా షార్ట్ సర్క్యూట్ వల్లే ఘటనలు జరిగాయి.

మాగనూరు మండలం వడ్వాటు శివారులోని బసవేశ్వర జిన్నింగ్, కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగి పత్తి బెండలు, పత్తి విత్తనాలు కాలి బూడిదయ్యాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మిల్లు నుంచి మంటలు రావడంతో పక్కన ఇంకో మిల్లులో పని చేస్తున్న కూలీలు యజమానికి సమాచారం ఇచ్చారు. వారు అగ్నిమాపక వాహనానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నారాయణపేట, మక్తల్ నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి, మిల్లులో ఉన్న మోటార్లు, ఇతర వస్తువులు కాలిపోకుండా మంటలను ఆర్పాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.ఎనిమిది కోట్లపైగా నష్టం వాటిల్లిందని మిల్లు యజమాని దండె తమ్మన్న తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కాలి బూడిదైన పత్తి బండల్స్‌ను, విత్తనాలను పరిశీలించారు. యజమానితో మాట్లాడి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆయిల్ ఫ్యాక్టరీలో..

పాలమూరు సమీపంలోని కోడూరు శివారులో గల చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్స్ ఆయిల్ ఫ్యాక్టరీలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. శనివారం రాత్రి 10 గంటలకు మంటలు అలుముకున్నాయి. ఫ్యాక్టరీలో తౌడు బస్తాలు అధికంగా ఉన్నందున మంటలు వేగంగా వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా.. వాహనం వచ్చి మంటలను ఆర్పింది. ఉదయం వరకు మంటలను ఆర్పాల్సి వచ్చింది. అక్కడ ఉన్న ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. తౌడు బస్తాలు, మిషనరీ, సోలార్ ప్యానెల్స్, వైరింగ్ చాలావరకు కాలిపోయాయి. ఆ సమయంలో ఫ్యాక్టరీలో ఎవరూ లేనందున ప్రాణనష్టం జరుగలేదు. దాదాపు రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని చెరుకుల్లి రాజేశ్వర్ తెలిపారు. కంపెనీ వాళ్లు వచ్చి అంచనా వేస్తున్నారని, వారి నివేదిక తరువాత ఎంత నష్టం జరిగిందో తెలుస్తుందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మహబూబ్‌నగర్ సమీపంలోని ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో కాలిపోయిన ట్రాక్టర్

కారు బోల్తా ఇద్దరికి స్వల్ప గాయాలు

ఇటిక్యాల మార్చి 24: కారు బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పరిధిలో మునుగాల శివారులో ఆదివారం చో టు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదండాపురం గ్రామానికి చెంది న నలుగురు వ్యక్తులు కారులో గద్వాలకు వెళ్లి తిరిగి వస్తుండగా మునుగాల గ్రామ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ఉన్న నలుగురు వ్యక్తుల్లో ఇద్దరికి స్వల్ప గాయాలు అ య్యాయి. కా రు బోల్తా పడడంతో ముందు, వెనుక భాగం దెబ్బతి న్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరి మృతి



దౌలత్ (ఫైల్‌ఫోటో)

చిన్నచింతకుంట, మార్చి 24 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల అల్లీపురం గ్రామ శివార్లో రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకుసంబంధించి ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని సీతారాంపేట గ్రామానికి చెందిన దౌలత్ (45) అనే వ్యక్తి తన భార్యఊరైన బాలకిష్టాపూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఆత్మకూర్ నుంచి ఎదురుగా వస్తున్న టీవీఎస్ చాంప్ వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న దౌలత్‌కు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారని తెలిసింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి బావిని పునరుద్ధరించాలి



పురాతన తాగునీటి బావి

అలంపూర్, మార్చి 24: అలంపూర్ పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న పురాతన బావిని పునరుద్ధరించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత ఎండాకాలంలో కూడా బావిలో నీరు పుష్కలంగా ఉందని, వినియోగంలో లేక పోవడంతో చెత్తాచెదారంతో నిండి ఉందన్నారు. బావిని తాగునీటి అవసరాల కోసం పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే గతంలో నిర్మించిన పాతబస్టాండు శిథిలావస్థకు చేరుకోవడంతో మలవిసర్జన, చెత్తాచెదారంతో నిండుకుందన్నారు. అలంపూర్‌కు వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్టాడ్‌ను అందుబాటులోకి తీసుక రావాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

పెద్దపల్లి బుగ్గస్వామి గుట్టపై
ఎనిమిదవ శతాబ్ది శివలింగం

-పెద్దపల్లిలో రాష్ట్ర కూటులు శివలింగం - కాపాడుకోవాలంటున్న శివనాగిరెడ్డి



ఆలయ పునరుద్ధరణ పనుల కోసం పరిసరాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

తెలకపల్లి, మార్చి 24 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి 20కిలో మీటర్ల దూరంలో తెలకపల్లి మండలం పెద్దపల్లి బుగ్గస్వామి గుట్టపైన రాష్ట్ర కూటులు కాలపు శివలింగం ఆనవాళ్లను గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ కవులు వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్ ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక వేంకటేశ్వరాలయ జీర్ణోద్ధరణ పనులపై పరిసరాలను పరిశీలిస్తుండగా, రాతిని తొలిచి మలిచిన ఐదు అడుగుల వ్యాసంతో పానవట్టం మధ్యలో శివలింగాన్ని ప్రతిష్ఠించడం కోసం అడుగు వ్యాసంలో ఆరు అంగుళాల లోతున గుంట చెక్కబడిందని తెలిపారు. వాస్తు శిల్పశైలిని బట్టి ఈ శివలింగ పానవట్టం ఇప్పటికీ 1200 సంవత్సరాల నాటిదని, క్రీ.శ.8వ శతాబ్దిలో ఈ ప్రాంతాన్ని పరిపాలనించిన రాష్ట్ర కూటుల కాలానికి చెందిందని, ఈ శివలింగాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. అదే గుట్టపై 200సంవత్సరాల నాటి శాసనముందని, అందులో దేవేంద్రపురికి చెందిన మునీశ్వరుని శిష్యులైన ఉపేంద్రపురి, విశ్వనాథుల ప్రస్తావన ఉందని, వీరిద్దరు ఇక్కడ సిద్ధిపొందారని ఉందని ఆయన వివరించారు. పెద్దపల్లి గ్రామస్థులు సురభి సత్యపాల్‌రావు, కేశవులుగౌడ్, దర్శి రాజయ్య, కందూరు లక్ష్మణస్వామి, బాలస్వామిగౌడ్, అర్చకులు వంశీకృష్ణ, స్థపతి, భీమిరెడ్డి, వెంకటరెడ్డి, శిల్పి ఎల్లయ్య, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, మార్చి 24 : మండలంలోని గంగారం గ్రామంలోని చెరువులో పడి చలపతి(40) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నాగశేఖర్ రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన మృతుడు చలపతి కొంతకాలంగా గంగారం గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి వద్ద గ్రానైట్ రాయి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిలేని ఖాళీ సమయంలో చెరువులో చేపల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం చెరువులో గుర్తు తెలియని శవం నీటిలో తేలిందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శవాన్ని బయటకు తీసి పంచనామా చేసి శవాన్ని గ్రామస్థులకు అప్పగించారు. ఈ ఘటనపై ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఈత చెట్లు దగ్ధం

తెలకపల్లి, మార్చి 24 : మండల పరిధిలోని దాసుపల్లి, బండపల్లి మధ్యలో ఆదివారం రాంరెడ్డికి చెందిన సుమారు 25ఈత చెట్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి కాలిపోయాయి. సమాచారం అందుకున్న నాగర్‌కర్నూల్ సిబ్బంది మిగతా చెట్లకు తగలకుండా మంటలను ఆర్పి పెను ప్రమాదాన్ని అరికట్టారు. ఈ ప్రమాదంలో సుమారు 80వరకు నష్టం జరిగిందన్నారు. ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి జగన్మోహన్‌గౌడ్, నగేష్, తిరుపతయ్య ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల, మార్చి 24 : మద్యం పట్టివేత కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం ఉప్పునుంతల కేజీబీవీ పాఠశాల సమీపంలోని చోటుచేసుకుంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవదారి కుంటతండాకు చెందిన కాట్రావత్ పంతుల్ ఆదివారం ఉదయం ఉప్పునుంతల వైన్స్ నుంచి కాటన్ బీర్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


12 తులాల బంగారం చోరీ

మక్తల్, మార్చి 24 : 12 తులాల బంగారం చోరీకి గురైంది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని న్యూ రాఘవేంద్ర కాలనీలో ఆదివారం తెల్లవా రుజామున చోటు చేసుకుంది. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మన్నెంకొండ విద్యుత్ శాఖలో పని చేస్తున్నాడు. ఎండాకాలం కావడంతో తన ఇంటి తలుపులకు కూలర్ అడ్డంగా పె ట్టుకుని ఇంట్లోనే కటుంబ సభ్యులతో నిద్ర పోయాడు. గు ర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి ఫ్రిజ్‌పై ఉన్న బీరువా తాళాలు 12 తులాల బంగారాన్ని అపహరించుకు పోయారు. ఉదయం నిద్ర లేచిన తర్వాత చోరీ జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ, ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అసైన్డ్‌భూములను పేదలకు పంచుతా

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశం

కొల్లాపూర్/పెంట్లవెల్లి, మార్చి 24 : అక్రమార్కులు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్‌నాయకులు, ఆక్రమించుకున్న అసైన్డ్ భూములను తిరిగి పేదలకు పంచుతామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పెంట్లవెల్లి మండలపరిధిలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించారు. దీంతో సమస్యలపై మంత్రి ఆరా తీయగా, బీఆర్ఎస్ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు చేసిన అవినీతి బాగోతాలు బట్టబయలయ్యాయి. మంచాలకట్ట గ్రామంలో సర్వే నెంబరు 96లో బీఆర్ఎస్ మండల మాజీ ప్రజా ప్రతినిధితో పాటు గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆంధ్రా పార్టీకి చెందిన రాష్ట్ర నాయకుడు కలిసి ఆ గ్రామంలో 96 సర్వే నెంబరులోని 86 ఎకరాల అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నట్లు మంత్రి రికార్డులను పరిశీలన తేలింది. నాయకులు తమ పేర్లపై కాకుండా బంధువుల పేర్లపై కూడా పట్టా పాస్ బుక్కులు చేశారని, ప్రభుత్వపరంగా ఉన్న వస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలను కూడా అనుభవిస్తున్నారని రికార్డుల పరిశీలనలో తేటతెల్లమైంది. అసైన్డ్ భూములు ఆక్రమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అక్రమార్కులను వదిలిపెట్టనని ఆయన స్పష్టం చేశారు. ఆక్రమించిన భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని మంచాలకట్ట గ్రామంలో భూమి లేని వారి వివరాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక తనకు ఇవ్వాలని, ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డా తాను సహించనని మంత్రి జూపల్లి వెల్లడించారు. అదేవిధంగా కృష్ణానదిలో ఉన్న మినీ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణానదిలో నీరు లిఫ్ట్ పైపులకు అందకపోవడంతో రైతులు పంటలు సాగు చేయడం లేదని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 400మీటర్ల పైపు తెచ్చి కృష్ణానది చివరి వరకు ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణానదిలో ముంపునకు గురవుతున్న బోయ కుంటను నీటి నిల్వ కోసం పూడిక తీస్తామని వారు పేర్కొన్నారు. మల్లేశ్వరం గ్రామంలో పెద్దగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, కాటేజీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు జాకిటి నిరంజన్, తిరుపాటి నాగరాజు, మదగం బాలరాజు, భోగ్యం నరసింహ, దబ్బ రాముడు, బొల్ల రఘు, గుడమోని కుర్మయ్య, వెంకటేశ్, గోవిందు, బిచ్చన్న పాల్గొన్నారు.



మంచాలకట్టలో మార్నింగ్‌వాక్‌లో భూముల అక్రమాలపై మంత్రి దృష్టికి తీసుకొస్తున్న గ్రామస్థులు

బాధ్యతతో పని చేస్తా

- కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్, మార్చి 24 : తనను మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపిస్తే ఎంపీ అనేది ఒక పదవిగా కాకుండా గురుతర బాధ్యతగా పని చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆదివారం ఉదయం డైట్ కళాశాల, ఎంవీఎస్ కళాశాల మైదానంతో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి వాక్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో కలిసి కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, దేశవ్యాప్తంగా భారత్‌జోడో యాత్ర తరువాత దేశం రాహుల్‌గాంధీవైపు చూస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెం టీలను అమలుచేస్తూ ప్రజల మన్ననలను అందుకుంటుందని, వంద రోజుల కాంగ్రెస్ పాలన చూసిన ప్రజలకు కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇవ్వాలని నమ్మకంగా ఉన్నారన్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, మహబూబ్‌నగర్‌లో భారీ మెజారిటీతో తనను గెలిపిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. రాష్ట్రంలో 14 స్థానాలకు తగ్గకుండా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మచ్చలేని తన రాజకీయ అనుభవనం, పనితనం చూసి తనను ఆశీర్వదించాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేల సహకారం, కార్యకర్తల సహకారంతో నియోజకవర్గా న్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందే బాధ్యతను తీసుకుంటానని, ప్రజలందరికీ అండగా ఉండి వారికి సేవలందిస్తానని కోరారు.కార్యక్రమంలో స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు సంజీవ్ ముదిరాజ్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

పాలమూరు : ఎంఐఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని షాలిమార్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు, మహ బూబ్‌నగర్ ఎంపీ అభ్య ర్థి చల్లా వంశీచంద్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీపీసీసీ అధికార ప్రతినిధి సంజీవ్ ముది రాజ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. హాదీ, మైనారిటీ సెల్ చైర్మన్ ఫయాజ్, డీసీ సీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఎన్‌పీ వెంకటేష్, జాకీర్, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, జుబేరిబిన్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడతా

- బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణమ్మ - మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం



వాకర్స్‌తో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణమ్మ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 24 : పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతానని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. బీజేపీ జిల్లా నాయకులతో కలిసి ఆదివారం బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం వాకర్స్‌ను కలిశారు. పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మోదీ గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె వాకర్స్‌తో కలిసి కొంత సేపు ఆ మైదానమంతా కలియతిరిగారు. మైదానంలో ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్ములో వ్యాయామం చేశారు. చిన్నారులు, మహిళలతో షటిల్ ఆడుతూ మైదానమంతా సందడి చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వానికి, భారతీయ జనతా పార్టీకి మద్దతునివ్వాలిని, పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అయిన నాకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా అభివృద్ధికి పాటు పడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, హరికృష్ణ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి

బాలానగర్ : ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి బీజేపీ ఓటు వేయాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ కోరారు. ఆదివారం మండలంలోని మోతీఘనపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో డీకే అరుణ మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు ఎన్నో సాహసోపేత నిర్ణయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్నారని గుర్తు చేశారు. అంతకుముందు అరుణను గజమాల, శాలువాలతో పలువురు నాయకులు సన్మానించారు. పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల చెందిన బీఆర్ఎస్, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాబోతుల శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ ఇన్‌చార్జీ నూరారం నర్సింములు, నాయకులు కోట జనార్దన్, సాలి శ్రీనివాస్‌యాదవ్, వంగూరు యాదయ్య, లింగం, కుమార్‌నాయక్, ధర్మరాజు, చింటు ఉన్నారు.

బీజేపీలో చేరిన మెట్టుకాడి శ్రీనివాస్, కిషోర్

పాలమూరు : తెలుగుదేశం పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ బీజేపీలో చేరారు. పార్లమెంట్ అభ్యర్థి డి.కె అరుణ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ 18వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కిషోర్‌కుమార్ కూడా బీజేపీలో చేరారు. ఇప్పటికే పాలమూరు పురపాలికలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరగా మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న కౌన్సిలర్ కిషోర్ ఆ పార్టీకి షాక్‌ఇచ్చి బీజేపీ కండువా కప్పుకోవటం గమనార్హం. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ నుంచి మరికొందరు కౌన్సిలర్లు బీజేపీలో చేరతారన్న ప్రచారం సాగుతోంది.

సకాలంలో మూల్యాంకనం పూర్తి చేయాలి

- ఇంటర్ బోర్డు అధికారి రవూఫ్
- మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర అధికారి, డీఐఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 24 : సకాలంలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు రాష్ట్ర అధికారి రవూఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మూల్యాంకన కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. క్యాంపులో కీలక విధులు నిర్వహిస్తున్న వాల్యుయేషన్ అధికారుల వివిధ రిజిస్టర్‌ను పరిశీలించారు. కేంద్రంలో అధ్యాపకులు పనిచేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వారికి జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. అక్కడ వసతులు ఎలా ఉన్నాయని అధ్యాపకులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని, ఉదయం 10 గంటల నుంచి సాయత్రం 5గంటల వరకు కచ్చితంగా విధులు నిర్వహించాలని అన్నారు. మూల్యాంకన సమయంలో ఎవరూ తమ సెల్‌ఫోన్‌లు హాలులోకి తీసుకురావద్దని సూచించారు. బోర్డు ఆదేశాలు పాటించని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు పంపించినట్లు తెలిపారు. డీఐఈవో శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ ఇంటర్ మూల్యాంకనం పకడ్బందీగా సాగుతోందని, అధ్యాపకులు సకాలంలో వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోడింగ్ అధికారి రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్స్ భగవంతచారి, ఉమామహేశ్వర్‌రావు, ప్రసన్నరాణిరాణి, ఏసీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో

ముగ్గురిపై కేసు నమోదు

ఎర్రవల్లి, మార్చి 24: మద్యం మత్తులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్ఐ స్వాతి ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఉండవల్లికి చెందిన సాయిల్, క్రిష్ణ శనివారం రాత్రి కోదండాపురం స్టేజీ సమీపంలోని అశోక్ కిరాణం దగ్గరకు వెళ్లి మద్యం మత్తులో గొడవ పడ్డారు. దాంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సిబ్బంది వచ్చి వారికి సర్దిచెబుతుండగా ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి చేశారు. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినందుకు సాయిల్, క్రిష్ణ, కోదండాపురం గ్రామానికి చెందిన ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపెద్ద రాళ్లను తరలిస్తున్న లారీ పట్టివేత

గద్వాల, మార్చి 24: మండల పరిధిలోని గోనుపాడు గ్రామ శివారులో అనుమతులు లేని స్టోన్ లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పెద్దపెద్ద బండరాళ్లను తొలగిం చి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనంపై గోనుపాడు గ్రామ ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ పోలీసు లు లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సై పర్వతాలును వివరణ కోరగా లారీని పట్టుకున్నమాట వాస్తవమేనని అయితే లారీ యజమాని పత్రాలు తెస్తానని చెప్పడంతో విచారణలో ఉంచామని కేసు నమోదు చేయలేదని తెలిపారు.



ఒడిబియ్యం కలుపుతున్న మహిళా భక్తులు

మన్యంకొండ అమ్మవారికి ఒడిబియ్యం పోసిన పద్మశాలీలు

పాలమూరు, మార్చి 24 : మన్యంకొండ అలవేలు మంగఅమ్మవారికి జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీర, సారెతో ఒడిబియ్యం నింపారు. ఉదయం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా చీర, సారె, ఒడి బియ్యం నివేదించారు. పట్టణంలో ఉదయం పద్మావతి కాలనీ కమాన్ నుంచి బైక్ ర్యాలీ, అశోక్‌టాకీస్ నుంచి వన్‌టౌన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభా యాత్రలో మేళతాళాలతో భజన, కోలాటాలతో నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అప్పం అనంతరాములు, బిజ్జ శంకర్, సూరప్రతాప్, దాసు వెంకటేష్, డాక్టర్ బి.శ్రీ కాంత్, సుకుమార్, రామస్వామి, తారకం, సత్యనారాయణ, పి.బాల రాజు, రాజశే ఖర్, కె.వెంకటేష్, కిశోర్, రాజు, విజయలక్ష్మి, రేణుక, స్వరూప, సదాలక్ష్మి, ఉమాదేవి, రమాదేవి, మానస, పూజ, మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న పద్మశాలీలు

వసూళ్లు ఘనం.. వసతులు శూన్యం

- హైవే నిర్వహణా సంస్థల నిర్లక్ష్యం
- నాహి అధికారుల అలసత్వం
- తాగునీరు లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- శిథిలమైన ట్యాంకులు

అలంపూర్ చౌరస్తా, మార్చి 24 : దేశంలోనే అతి పెద్ద రహదారి అయిన 44వ జాతీయ రహదారి కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. 2006లో దీనిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించారు. ఆ సమయంలో కనీసం ప్రతీ మూడు కిలోమీటర్లకు లేదా ఆయా మండల, ప్రధాన పల్లెల స్టేజీల సమీపంలో బస్టాండులు, వాటికి అనుసంధానంగా తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. అక్కడ బస్ బేలు కూడా నిర్మించి, మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించారు. రహదారితో సహా వీటన్నింటి నిర్వహణ బాధ్యతలు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు ప్రైవేటు కంపెనీలకు టెండర్ల రూపంలో అప్పగించారు. మొదట్లో అవసరమైన వసతుల నిర్వహణ చేపట్టినా కాలక్రమేణా వాటి నిర్వహణ బాధ్యతలు పరిశీలించాల్సిన ఎన్‌హెచ్ఏఐ (నాహి) అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

కనీస వసతులు కరువు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 170 కి.మీ. మేర జాతీయ రహదారి నిర్మించి ఉంది. ఇందులో పలు మండలాలతో పాటు ముఖ్య పట్టణాలు షాద్‌నగర్, జడ్చర్ల, కొత్తకోట, పెబ్బేరు ఉన్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతలను క్యూబ్ అనే ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తోంది. ఇది కొత్తకోట నుంచి కర్నూల్ నగరంలోని కృష్ణనగర్ కాలనీ వరకు నిర్వహణను చూస్తుంది. ఈ సంస్థ జాతీయ రహదారిపై ప్రయాణికులకు అవసరమైన రక్షణ చర్యలు, మౌలిక వసతులు, తాగునీరు, రోడ్డు మరమ్మత్తులు, ప్రధాన కూడళ్లలో లైటింగ్ ఏర్పాట్లు, టాయిలెట్స్ తదితర నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాలి.

బాధ్యత మరిచిన నిర్వహణా సంస్థ

ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చూస్తున్న సంస్థ చేపట్టిన 75 కి.మీ. జాతీయ రహదారి అటు, ఇటు 16 మరుగుదొడ్లు, ఎనిమిది టాయిలెట్స్, నాలుగు స్నానపు గదులున్నాయి. ఒక్కో గది వద్ద నాలుగు మరుగుదొడ్లు, ఒక స్నానపు గది ఉండాలి. కానీ ఎక్కడ కూడా రెండు మించి పని చేయడం లేదు. ఉన్నవాటికి కూడా డోర్లు సరిగా ఉండవు. ప్రతీ గది వద్ద ఒక బోరు ఉండాలి. కానీ చాలాచోట్ల బోరు బావులు మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో నాలుగు రోజులకోసారి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్నిసార్లు నీరు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు వాడుకునే ప్రయాణికులు డ్రమ్ముల్లో ఉన్న నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇక పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద అయితే మరుగుదొడ్లు, బాత్‌రూంలు ఉన్నాయనే సంగతి ప్రయాణికులకే తెలియదు. కర్నూల్ వైపు వెళ్లే వైపు ఉన్న టాయిలెట్స్ గదుల వద్ద నిత్యం భారీ వాహనాలు నిలిచి ఉంటాయి. దీంతో అవి ప్రయాణికులకు కన్పించడం లేదు. పక్కనే వైన్ షాపులుండటంతో వీటి వద్ద నిత్యం మందుబాబులు ఆటోలు నిలిపి మద్యం తాగుతూ ఉంటారు. ప్రయాణికులు అటువైపు వెళ్లాలంటే జంకుతున్నారు. వీటి బాధ్యత ఓ ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంతో వీటి నిర్వహణ అటకెక్కింది. ప్రయాణికుల నుంచి ముక్కుపిండి టోల్ వసూలు చేసే నాహి సంస్థ ప్రయాణికులకు కల్పించాల్సిన వసతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మెయింటనెన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుందనే చెప్పాలి. వందలకు వందలు టోల్ చెల్లించే ప్రయాణికులకు నిబంధనల ప్రకారం ఉండాల్సిన వసతులు కొరవడుతున్నాయి. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అనుగుణంగా ప్రతీ స్టేజీ వద్ద ఒక బస్టాప్ ఏర్పాటు చేశారు. వీటి వద్ద తాగునీటి కోసం ట్యాంకులను ఏర్పాటు చేశారు. పలుచోట్ల తాగునీరు లేదని.. మరికొన్ని చోట్ల శిథిలమయ్యాయని లారీ డ్రైవర్లు వాపోయారు. నీరు లేక దూర ప్రాంతాలకు వెళ్లే లారీల డ్రైవర్లు వంట చేసుకునేందుకు, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు వేసవిలో దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు.



జాతీయ రహదారిపై పగిలిపోయిన తాగునీటి ట్యాంకు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మరుగుదొడ్ల పరిస్థితి ఇలా..

వారంలో రెండుసార్లు తాగునీరు నింపుతున్నాం

ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో వారంలో రెండుసార్లు తాగునీటిని నింపుతున్నాం. ఎక్కడైనా అవి శిథిలమై ఉంటే క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నూతన ట్యాంకులను ఏర్పాటు చేస్తాం. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు సిబ్బందిని నియమించాం. బోరు లేనిచోట ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. ఇక పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న టాయిలెట్స్ మా పరిధిలో లేవు.

- ప్రసాదరావు, క్యూబ్ నిర్వహణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్

కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు


ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బిజినేపల్లి, మార్చి 24 : వట్టెం వెంకన్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మూడవ రోజు ఆదివారం భక్తుల కోలాహలంతో స్వామి వారి ఎదుర్కోలు వైభవంగా కొనసాగాయి. అంతకు ముందు ఉదయం ఆరు గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రాతరారాధన, ఉత్సవాంగ స్నపనమ్, అలంకారం, అర్చన సేవాకాలం, నివేదన, హోమం, తీర్థప్రసాదగోష్టి నిర్వహించారు. ఉత్సవులకు నవకలశ స్నపన తిరుమంజనం, అలంకారం రాజభోగ నివేదన వంటి ప్రత్యేక పూజలు అర్చకులు చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి ఎదుర్కోలు ఉత్సవం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలను ఆలయ అర్చక బృందం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, సందడి ప్రతాప్ రెడ్డి, కొత్త చంద్రారెడ్డి, నరేందర్ రెడ్డి, వడ్ల భాస్కరాచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భగీరథ నీళ్లు పొలాలకు పారిస్తున్న వ్యక్తులపై ఫిర్యాదు

బిజినేపల్లి, మార్చి 24 : 70 గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యే భగీరథ పైపులైన్ ఎయిర్‌వాల్‌ను తెరిచి పంట పొలాలకు నీటి పారించుకుంటున్న వ్యక్తులపై భగీరథ ఏఈ వినోద్ నాయక్ ఆదివారం ఎస్సై నాగశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బిజినేపల్లి మండలంలోని కారుకొండ గ్రామ శివారులోని భగీరథ తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఎయిర్ వాల్‌ను గుడ్లనర్వ గ్రామానికి చెందిన కుర్వ రాములు, మల్లయ్యలు తెరిచి పంట పొలాలకు పారించుకోవడంతో కొన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ వెంబడి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. కారుకొండ గ్రామ శివారులో రైతులు పంట పొలాలకు నీటిని పారించుకోవడం గమనించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ వినోద్ నాయక్ తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

లింగాల, మార్చి 24: నల్లమల అటవీ ప్రాంతంలో గల ఎర్రపెంటలో చెంచు గిరిజనుల అభ్యున్నతికై అండగా నిలుస్తూ.. మౌలిక సదుపాయాల కల్పనకై పెంటను దత్తత తీసుకుంటున్నట్లు నీడి ఇల్లిటరేట్ చిల్డ్రన్ ఎడ్యూకేషన్ (నైస్) సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పూర్ణచందర్‌రావు అన్నారు. ఆదివారం ఎర్రపెంటలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న 100 చెంచు కుటుంబాలకు ఒక్కొకరికి రూ.3500 విలువ గల నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. సరుకులతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు మిల్లెట్స్ పౌడర్ కూడా అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచు గిరిజనులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తమ సంస్థ చేయూత అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పౌష్టికాహారానికి దూరమై దుర్భర జీవనాన్ని సాగిస్తున్న చెంచు గిరిజనులకు నిత్యావసర సరుకులను అందజేసేందుకు మూడు కోట్ల రూపాయలతో కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. అందులో భాగంగానే ఎర్రపెంటలోని చెంచు గిరిజన కుటుంబాలకు ప్రతి నెల రూ. 3500 విలువజేసే నిత్యావసర సరుకులను ఐదేళ్ల పాటు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం 300 మందికి పౌష్టిక విలువలతో కూడిన భోజనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీధర్, ఆర్డీటీ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ అప్లికేషన్ ఫీజు తగ్గించాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

కందనూలు, మార్చి 24 : నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో టెట్ అప్లికేషన్ ఫీజు తగ్గించాలని జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ముందు నిరుద్యోగులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కుంభం రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ పరీక్ష అప్లికేషన్ ఫీజు వంద రూపాయలు, గ్రూప్-1, గ్రూప్-2 అప్లికేషన్ ఫీజు 200రూపాయలు కానీ టెట్ అప్లికేషన్ ఫీజు ఒక్క పేపర్‌కు వెయ్యి రూపాయలు రెండు పేపర్లు రాస్తే 2వేలు ఆన్‌లైన్ చార్జెస్‌గా కలిపితే మొత్తం 2500రూపాయలు అవుతుందని తెలిపారు. దీంతో నిరుద్యోగులకు తీవ్రమైన ఆర్థిక భారమవుతుందన్నారు. ప్రభుత్వం కూడా నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపేలా ఫీజులు పెంచుతున్నారని దుయ్యబట్టారు. వెంటనే టెట్ ఫీజును 200రూపాయలకు తగ్గించాలని, లేనిపక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిరుద్యోగుల సత్తా చాటుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త సంజయ్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీకాంత్, కోశాధికారి వడ్డెమాన్ శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, మహాలక్ష్మీ, పావని, శిరీష, మాధవి, పావని, మంజుల, కవిత, సురేష్, కుర్మయ్య, శివకాశి, శ్రీహరి, శ్రీకాంత్, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రంగనాయకస్వామి ఉత్సవాలు


రంగనాయకస్వామి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కందనూలు, మార్చి 24 : శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయంలో వార్షిక అధ్యయన ఉత్సవాలు ఆదివారం ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో చివరి రోజున స్వామి వారి పరమ పద ఉత్సవం, పల్లకి సేవ తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, మురళీధరాచార్యులు, అర్చకులు వినోదాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, వరదయ్య, చంద్రనారాయణ, మాధవరెడ్డి, గోపినాథ్, మల్లికార్జున్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల కమిటీ ఎన్నిక


ఎన్నికైన జానపద కళాకారుల కమిటీ సభ్యులు

బల్మూరు, మార్చి 24 : మండల జానపద కళాకారుల సంఘం మండల అధ్యక్షుడిగా మద్దెల అర్జున్‌ను ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో మండలంలోని జానపద కళాకారుల సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాటి గ్రామీణ ప్రాంతాల్లో పేద ధనిక తేడా లేకుండా జానపద కళలతో బ్రాహ్మణ యువత రైతులకు అవగాహన కల్పించే వారని, నేడు మీడియా ప్రపంచం రావడంతో ఉన్నది లేనిది తప్పుదోవ పట్టించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పీకే.గౌడ్, గౌరవ సలహాదారులుగా డి.రాములు, మురళీధర్‌రావు, జిల్లా కమిటీ మెంబర్‌గా కాటిపాక నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి, జిల్లా ప్రచార కార్యదర్శిగా కార్వంగ రాము, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా గడ్డం అంజయ్య ఉపాధ్యక్షుడిగా లింగంను ఎన్నుకున్నారు.

రోజురోజుకూ తగ్గిపోతున్న చిరుధాన్యాల దిగుబడి

- అంతంత మాత్రంగానే అన్నదాతల సాగు విస్తీర్ణం
- మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- అత్యల్పంగా నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 28 ఎకరాలల్లోనే కందిపంట సాగు


ఊర్కొండ మండలం జీడిపల్లి గ్రామం వద్ద రైతులు సాగు చేసిన జొన్న పంట

తాడూరు, మార్చి 24 : చిరుధాన్యాల సాగు వైపు అన్నదాతలు చూడకపోవడం వాతావరణ మార్పుల వల్లేనో లేదా పని భారం ఎక్కువగా ఉంటుందనే సమస్యతోనో అన్నదాతలు చిరుదాన్యాల సాగు వైపు మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా జొన్న, రాగులు, కందులు, సజ్జలు, బెబ్బర్లు, శనగలు, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగు వైపు అన్నదాతలు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాగుకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం కంది పంట 28ఎకరాలల్లోనే సాగు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రస్తుతం జొన్న జిల్లా వ్యాప్తంగా 2వేల 215ఎకరాలల్లో సాగవుతుంది. పొద్దుతిరుగుడు 35ఎకరాలు సాగవుతుంది. మానవ జీవన మనుగడ కోసం చిరుధాన్యాలు ఎంతగానో కీలకపాత్ర పోషిస్తున్న క్రమంలో జిల్లాలో సాగు విస్తీర్ణం లేకపోవడం కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. ప్రస్తుతం యాసంగి పంటలో అన్నదాతలు మొక్కజొన్న వైపు ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆశించినంత మేర దిగుబడి సాధిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న వైపే మొగ్గు చూపుతున్నారు.

ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 15వేల 543ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్నలో సుమారు 25క్వింటాళ్ల నుంచి 40క్వింటాళ్లకు పైగానే దిగుబడి సాధిస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో సైతం మొక్కజొన్నకు ప్రస్తుతం 2వేల 300రూపాయలు క్వింటాల్‌కు పలుకుతుండడంతో అటుగానే అన్నదాతలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు అన్నదాతలకు వర్షాకాల ఆరంభ సమయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచే విధంగా చేస్తే బాగుంటుందని పలువురు ఆశిస్తున్నారు. ప్రధానంగా ప్రతీ కుటుంబానికి అవసరమయ్యే కంది, పెసర సాగు గణనీయంగా తగ్గిపోవడం అసలు మంచిది కాదంటూ ప్రభుత్వం చిరుధాన్యాలకు మరింత మద్దతు ధరలు పెంచి రైతులతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.

పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం

- ఒరిగిన విద్యుత్ స్తంభాలు

వంగూరు, మార్చి 24: పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఒకపక్కకు ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో పొలం పనులకు వెళ్లే రైతులకు ప్రాణభయం తప్పడం లేదు. మండలంలోని ఉప్పలపహాడ్, వంగూరు పంట గ్రామాల్లోని పంట పొల్లాలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండటంతో విద్యుత్ తీగలు కూడా అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

ఈ విషయంపై ఎన్నో సార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగితేగాని స్పందిస్తారా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు మీద పడుతాయో తెలియని స్థాయిలో ఉన్న స్తంభాలను వెంటనే సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

పంట పొల్లాలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరి చేయాలి. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రైతులు ప్రమాదాలకు గురికాక తప్పదు. పెనుగాలులు వీచినప్పుడు స్తంభాలు ఎక్కడ మీద పడుతాయోనని భయంగా ఉంది.

- బాలకిష్టయ్య, రైతు, ఉప్పల్‌పహాడ్

చర్యలు తీసుకుంటాం

మండలంలోని గ్రామాల పంట పొల్లాలో ఒరిగి విద్యుత్ స్తంభాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే చేయిస్తాం. ఉప్పలపహాడ్, వంగూరులో ఒరిగిన స్తంభాలు, వేలాడిన కరెంట్ తీగలను సవరిస్తాం. అందుకు రైతులు కూడా సహకరించాలి.

- మేఘనాథ్, ఏఈ ట్రాన్స్‌కో, వంగూరు


ఉప్పలపహాడ్ వ్యవసాయ పొలంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

- స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, మార్చి 24 : లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఆవరణలోని కల్యాణ మండపంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా వేదపండితుల నడుమ కల్యాణం జరిపించారు. కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అనూరాధ దంపతులు హాజరై ఆలయంలో స్వామి వారికి వారు ప్రతేక్య పూజలు నిర్వహించి ఆలయం నుంచి ప్రభుత్వం లాంఛనంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు మండపానికి తీసుకవచ్చారు. అంతకు ముందు ఎదుర్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ మాధవరం రాజాల్‌రావుతో పాటు నలుమూలల భక్తులు హాజరయ్యారు.

అదే విధంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి అనూరాధ దంపతులతో పాటు ఆయల కమిటీ చైర్మన్ మాధవరం రాజాల్‌రావు దంపతులతో పాటు పలువురు కల్యాణం తిలకించారు. అదే విధంగా మండల ప్రజలతో పాటు వంగూరు, కల్వకుర్తి, తెలకపల్లి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాట్లు పలు జిల్లాల ప్రజలు కల్యాణ మహోత్సవం తిలకించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వంహించారు. మొక్కులు చెల్లించుకొని స్వామి తీర్థ ప్రసాదం తీసుకున్నారు. ఉమామహేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి కల్యాణ మండపాన్ని 20 లక్షల నిధులతో పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా పెద్ద తేరు మరమ్మతులు చేయిస్తామన్నారు. కల్యాణోత్సవం పురస్కరించుకొని ఆలయం ఆవరణలో రాత్రి హైదరాబాద్ వారిచే డ్యాన్స్, సాంగ్స్, మిమిక్రీతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయ ఈవో శ్రీనివాసురావు, నాయకులు మొహన్‌గౌడ్, గణేష్‌గౌడ్, దామోదర్, బాల్‌రావు, సైదులు, సుదర్శన్, అర్చకులు నర్సింహమూర్తి, విజయ రాఘవరావు, త్రివేదచారి, గోపాల్‌చారి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

- మంత్రి జూపల్లి కృష్ణారావు


కొల్లాపూర్ క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మార్చి 24 : కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం రాత్రి కొల్లాపూర్ పట్టణానికి విచ్చేసిన మంత్రిని కలిసి సమస్యలు విన్నవించుకునేందుకు ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు వివిధ గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బారులు తీరారు. ఈ సందర్భంగా మంత్రి వారి సమస్యలను సానుకూలంగా విని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలనైనా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో కొల్లాపూర్ పట్టణంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తల్తెతకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో ఎంపీ ఎన్నికల తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడే పనులన్నీ మొదలవుతాయని జూపల్లి వెల్లడించారు.

తూడుకుర్తిలో హెల్త్ క్యాంపు

కందనూలు, మార్చి 24 : సమాజ సేవ చేయాలనుద్దేశంతో ప్రతీ ఆదివారం ఒక గ్రామంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీచిన్న పిల్లల హాస్పిటల్ డాక్టర్ శ్రావణి, డాక్టర్ ఉదయ్‌కుమార్‌లు తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు ఇద్దరూ పీడీయాట్రిషన్ గైనకాలజిస్టులు కావడంతో గ్రామంలో మహిళలు, చిన్నారుల కోసం మాత్రమే హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చి డబ్బులు పెట్టలేక చాలా మంది పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతుండడం చూసి ప్రతి వారం ఒక గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'

కల్వకుర్తి, మార్చి 24 : కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆదివారం దుర్గాప్రసాద్ మాట్లాడారు. భారతదేశం మోదీ పాలనతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దేశంలో ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా పది సంవత్సరాలు పాలించిన ఘనత మోదీకే దక్కిందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించి మోదీకి కానుకగా ఇద్దామని అన్నారు.

'నీటి కుక్కలను తరలించాలి'

అమరచింత, మార్చి 24: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో నీటి కుక్కల కారణంగా తాము నష్టపోతు న్నామని మత్స్యకార్మికులు ఆదివారం ఫిషరీస్ ఏడీ లక్ష్మప్ప, ఫారెస్టు అధికారులకు విడివిడిగా ఫిర్యాదు చేశారు. 20 రోజులుగా పెద్ద చెరువులో దాదాపు 12కు పైగా నీటి కుక్కలు చేపలను తింటూ తమకు నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు 60 కిలోలకు పైగా చేపలను నీటి కుక్కలు తింటున్నాయని, ఇప్పటికే లక్షల్లో నష్టపోయామని తక్షణే అధికారులు స్పందించి చెరువులో ఉన్న నీటి కుక్కలను తరలించాలని వారు ఫిర్యాదు ద్వారా కోరినట్లు మత్స్యకార్మిక సంఘం నాయకుడు రవికాంత్, టీవీ రవి, గోపి, రమేష్, వెంకటన్న తదితరులు తెలిపారు.

ఘనంగా హజ్రత్‌సయ్యద్ హక్కానీషా సాహెబ్ ఉర్సు

- కనుల పండువగా గంధోత్సవం


హజ్రత్‌సయ్యద్ హక్కానీషా సాహెబ్ ఉర్సు నిర్వహిస్తున్న దృశ్యం

కందనూలు, మార్చి 24 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఉర్సు ఘనంగా నిర్వహించినట్లు గంధోత్సవ నిర్వాహకులు తెలిపారు. సయ్యద్ హక్కాని షా సాహెబ్ దర్గాలో భక్తిశ్రద్ధల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వాహకుల నివాసాల్లో ఖవ్వాలి కార్యక్రమాలతో ఫాతేహా అనంతరం దర్గాలో గంధం సమర్పించారు. సయ్యద్ ఇమ్రాన్ చిస్తి నివాసంలో ఖవ్వాలి, గంధోత్సవం నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ గంధోత్సవానికి జిల్లా నలుమూలలతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న హజ్రత్ సయ్యద్ హక్కానీషా సాహెబ్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉప్పునుంతల, మార్చి 24 : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం... కంసానిపల్లి తండాకు చెందిన శివ అచ్చంపేట నుంచి కంసానిపల్లి వెళుతున్నారు. అదే విధంగా నడింపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం చౌదరిపల్లి నుంచి అచ్చంపేట వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు తమ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణంలో ఉప్పునుంతల విద్యుత్ సబ్ సేష్టన్ వద్ద శివ బైక్ అతివేగంగా వచ్చి శ్రీశైలం బైక్‌ను ఢీకొట్టాడు. శ్రీశైలానికి తీవ్ర గాయాలన్నట్లు వారు తెలిపారు. శ్రీశైలం మేనల్లుడు మక్కల సురేష్ ఆదివారం ఫిర్యాదు మేరకు శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం పండుగ


మట్టల పండుగ ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

కల్వకుర్తి, మార్చి 24 : కల్వకుర్తి పట్టణంలోని వార్కంటిన్ మెమోరియల్ ఎంబీ చర్చిలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ జేబీరాజు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఖర్జూరపు మట్ట, ఈత మట్టలు చేత పట్టుకుని పట్టణ పురవీధుల్లో ఏసుక్రీస్తుకు జేజేలు పలుకుతూ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ఆరాధన చేపట్టారు. జేబీ రాజు సందేశమిచ్చారు. సంఘ సభ్యులు జగదీశ్, సురేష్‌బాబు, ఇజ్రాయేల్, పాస్టర్ అమ్మజ్యోతి, పద్మ, వైడూర్య, యూత్ సెక్రటరీ నందు, జాయ్, సండే స్కూల్ టీచర్ పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణ పరిసర ప్రాంతాల్లోని చర్చిలల్లో మట్టల ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు.

డీవైఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి, మార్చి 24 : డీవైఎఫ్ఐ పెంట్లవెల్లి మండల కమిటీ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా శివ, కార్యదర్శిగా ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువజన సమస్యలపై ఉపాధి ఉద్యోగ అవకాశాలపై పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు.

మల్లురవిని ప్రజలు ఆదరిస్తారు


మాట్లాడుతున్న రంగినేని జగదీశ్వరుడు

కొల్లాపూర్, మార్చి 24 : త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మల్లురవిని ప్రజలు ఆదరిస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పని చేస్తూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా నిలిచిన మల్లురవిని గెలిపించుకుంటామని తెలిపారు. లక్షా 50వేల పైచిలుకు మెజార్టీతో మల్లురవి గెలుపు ఉంటుందని జగదీశ్వరుడు జోస్యం చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటె శివన్న తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మను దర్శించుకున్న భక్తులు


మైసమ్మ దేవతకు మొక్కుతున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, మార్చి 24 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవతను భక్తులు దర్శనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం 30వేలకు పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా ఒక లక్ష 39వేల రూపాయలు, టికెట్ల ద్వారా 76వేల రూపాయలు మొత్తం 2లక్షల 15వేల 765 రూపాయలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సిబ్బంది మారుతీరావు తెలిపారు.

మక్తల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలసిన మైసమ్మ దేవతను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. ఆదివారం నాయినోనిపల్లి గ్రామ శివారులో మైసమ్మ ఆలయానికి వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి, మార్చి 24 : మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన బి.లింగస్వామి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 36వేల 500రూపాయల చెక్కును ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదారి చంద్రశేఖర్ బాధితునికి అందజేశారు. సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు చేయించి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు సన్మానం


చింతలపల్లి జగదీశ్వర్‌రావును సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెద్దకొత్తపల్లి, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వ మైనర్ ఇరిగేషన్ చైర్మన్‌గా ఎంపికైన చింతలపల్లి జగదీశ్వర్‌రావును కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా యాపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీశ్వర్‌రావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు ఖాజా, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్మయ్య, బాలపీరు, సురేష్‌కుమార్, మనోహర్, దస్తగిరి, ఉమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లురవిని కలిసిన మాజీ సర్పంచ్

కల్వకుర్తి, మార్చి 24 : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని కాంగ్రెస్ జిల్లా నాయకులు, తోటపల్లి మాజీ సర్పంచ్ పసుల రాజేష్‌రెడ్డి ఆదివారం కలిశారు. ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం మల్లురవిని ప్రకటించడంతో నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమైపోయిందని ఆయన పేర్కొన్నారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్‌కు బాసటగా నిలుస్తున్నారని రాజేష్‌రెడ్డి తెలిపారు.